

పోయిరా బతుకమ్మ.. మళ్లీరా గౌరమ్మ

జిల్లా కేంద్రంలో వాడవాడలా గురువారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో నిండుగా బతుకమ్మను పేర్చి పట్టణంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు పాటలు పాడుతూ, కోలాటాలు వేస్తూ, డిజే పాటలకు నృత్యాలు చేస్తూ పోయిరా బతుకమ్మ అంటూ సాదరంగా సాగనంపారు. వినాయక సాగర్, ధర్మాసాగర్, కంచరోని చెరువుల వద్ద ఏర్పాటు చేసిన ఘాట్‌ల వద్ద నిమజ్జనం చేశారు.

- చిత్రాలు : న్యూస్‌టుడే, నిర్మల్

వినాయక్ సాగర్‌లో నిమజ్జనం చేస్తున్న యువతులు

కోలాటం ఆడుతూ..

బతుకమ్మలతో యువతులు

వినాయక్‌సాగర్ వద్ద బతుకమ్మ ఆడుతూ..

నేడు బాసరలో ప్రత్యేక పూజలు

ముథోల్(బాసర): బాసర ఆలయంలో విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు యాగక్రతువు ప్రారంభం, శనివారం వేకువజామున 2 గంటల నుంచి చండీయాగం ప్రారంభం, అనంతరం పూర్ణాహుతి, అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ అనంతరం హారతి చేసిన తర్వాత భక్తులకు దర్శనం, అక్షరాభ్యాసాలు ప్రారంభం, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రథోత్సవం, సాయంత్రం శమీపూజ, ఆశీర్వచనం ఉత్సవ సమాప్తి ఉంటుందని ఆలయాధికారులు తెలిపారు.

ఆటే శ్వాస.. ధ్యాస!

- రంజీ ట్రోఫీ పోటీలకు హిమతేజ ఎంపిక
- ఉమ్మడి జిల్లా నుంచి అవకాశం దక్కించుకున్న తొలి క్రికెటర్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ కాలం కుర్రాళ్లంటే స్మార్ట్‌ఫోన్లు, సరదాలు, స్నేహితులు, షికార్లు ఉంటాయి. కానీ ఆ యువకుడికి మాత్రం మైదానమే లోకం. క్రికెట్ బ్యాట్, బాల్, స్టంప్స్, గ్లౌవ్స్, అతడి నేస్తాలు. ఆస్వాదించే వయసులో అన్నింటిని వదిలేసి.. లక్ష్యం వైపే ఏకాగ్రతను కేంద్రీకరించాడు. 12 ఏళ్ల మైదానంలో శ్రమించి కలను నిజం చేసుకున్నాడు. బీసీసీఐ నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ జట్టు సభ్యుడిగా శుక్రవారం జింఖానా మైదానం(హైదరాబాద్)లో అరంగేట్రం చేయనున్నాడు. అతడే కొడిమెల హిమతేజ. కష్టపడితే ఏ రంగంలోనైనా విజయం వరిస్తుందని నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.



క్రికెట్ మెరుపుల్లో కొన్ని...

- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2013లో కశ్మీర్‌లో అండర్-14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో మూడు అర్ధ సెంచరీలు.
- 2017లో అండర్-16, 2019లో అండర్-19 హెచ్‌సీఏ పోటీల్లో పరుగుల వర్షం కురిపించాడు.
- 2023లో అండర్-23 సీకె.నాయుడు స్మారక పోటీలకు హైదరాబాద్ జట్టు సారథిగా ఎంపిక. పోటీల్లో అత్యధిక పరుగులు చేసి నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) గుజరాత్ శిక్షణ శిబిరానికి ఎంపిక.
- 2023లో హెచ్‌జీఏ - న్యూజిలాండ్-ఎ జట్ల పోరులో 49 బంతుల్లో 85 పరుగులు.
- 2024లో బుచ్చిబాబు స్మారక పోటీల్లో ప్రతిభ కనబరిచి రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపిక.

చదువులో, క్రికెట్‌లో మేటి..

ఆదిలాబాద్‌కు చెందిన కొడిమెల మధుసూదన్-కామేశ్వరి దంపతుల కుమారుడు హిమతేజ. చిన్నప్పటి నుంచి చదువులో, క్రికెట్‌లో మేటి. పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు. బాబాయ్ వేణుతో కలిసి గల్లీలో ఎడమచేతితో ఆడడం, గంటల తరబడి ఔట్ కాకుండా ఉండటంతో ఆయనను జేసీ క్రికెట్ అకాడమీలో చేర్పించారు. సరైన వసతులు లేకున్నా సాధన చేశాడు. ఉమ్మడి జిల్లా నుంచి రంజీ ట్రోఫీ పోటీలకు తొలి క్రికెటర్‌గా ఎంపికయ్యాడు.

ఈ ప్రయాణంలో ఎన్నింటినో త్యాగం చేశాడు

- మధుసూదన్-కామేశ్వరి, తల్లిదండ్రులు

హిమతేజ రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికైనందుకు చాలా గర్వంగా ఉంది. కష్టపడిన దానికి ఫలితం దక్కింది. ఈ క్రికెట్ ప్రయాణంలో మా బాబు ఎన్నింటినో త్యాగం చేశాడు. మేము మా బాబుతో గడిపింది చాలా తక్కువే. క్రీడా భవిష్యత్తు గురించి ఆలోచించి ప్రోత్సహించాం. ఎప్పుడూ చూసినా మైదానంలో సాధన చేసే హిమతేజను కలవాలంటే రాత్రి వేళల్లో మాత్రమే సాధ్యమయ్యేది. అది కూడా రెండు గంటలే మాట్లాడుకునేవాళ్లం.

భారత జట్టుకు ఆడటమే నా కల..

- హిమతేజ

రంజీ ట్రోఫీ పోటీలకు హైదరాబాద్ జట్టుకు ఎంపిక అయ్యానన్న విషయం ఇప్పటికీ కలగానే అనిపిస్తుంది. ఇదే స్ఫూర్తిని కనబరిచి రంజీ ట్రోఫీ పోటీల్లో రాణిస్తా. భారత జట్టుకు ఎంపికే లక్ష్యంగా పెట్టుకున్నా. రంజీకి ఎంపిక కావడంతో ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కింది.

పొలం బాట.. అన్నదాతకు బాసట

- విద్యుత్తు శాఖ చర్యలతో సమస్యలు పరిష్కారం

న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్ :

జిల్లాలో అత్యధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నీటి లభ్యతతోపాటు బోరుబావులతో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక విద్యుత్తు వ్యవసాయ కనెక్షన్లు ఇక్కడే ఉన్నాయి. ప్రభుత్వం, ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ మండలి సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతుల దగ్గరకు, వ్యవసాయ క్షేత్రాలలో నేరుగా అధికారులు, సిబ్బంది నిత్యం వెళ్లి వారి సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. ఆగస్టు 1న జిల్లాలో ప్రారంభించారు. ప్రతి నెల మొదటి వారంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



వొరిగిన స్తంభాన్ని సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది, రైతులు

క్షేత్రస్థాయిలో..

అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను కలుస్తుండటంతో పలు సమస్యలు వారి దృష్టికి తీసుకొస్తున్నారు. ముఖ్యంగా వంగిన, స్తంభాలు దూరంగా ఉండి తీగలు వేలాడటం, ఏళ్ల నాటి ఇనుప స్తంభాలు, నియంత్రికల మరమ్మతులు, పోల్స్‌కు రక్షణగా స్టే వైర్లు వంటి పనులు చేపడుతున్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. జిల్లాలో 71,613 వ్యవసాయ బోరు మోటార్ల కనెక్షన్లు ఉన్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ఉండటంతో సరఫరాలో హెచ్చుతగ్గులు, తదితర సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే ఉపకేంద్రాల్లో 1- 2 ఎంవీఆర్ (మెగా వాల్ట్ ఆంపియర్ రియాక్టర్ పవర్), ఎక్కువ దూరం తీగలున్న, అధికంగా వినియోగ మయ్యే 11 కేవీ విద్యుత్తు తీగల మధ్య 600 కేవీఆర్ (కిలో వాల్ట్ ఆంపియర్ రియాక్టర్ పవర్) కెపాసిటర్ బ్యాంకులు అమర్చారు.



రైతులకు అందజేసిన కెపాసిటర్లతో ఎమ్మార్టీ డీఈ శ్రీనివాస్‌రావు

రైతుల్లో చైతన్యం..

విద్యుత్తు వినియోగం, వ్యవసాయ బోరు మోటార్ల నాణ్యతను పెంపొందించేందుకు కెపాసిటర్లు అమర్చుకునేలా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తక్కువ ధరతో లభించే కెపాసిటర్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తూ చైతన్యం తీసుకొస్తున్నారు. పలువురు అన్నదాతలు ముందుకొస్తూ వాటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. నెలలో వారం రోజుల పాటు వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తుండటంతో వారికి సమస్యలు తెలియజేసే అవకాశం కర్షకులకు రావడంతోపాటు అధికారులు, సిబ్బందికి వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా అవగాహన పెరుగుతోంది.

ఇప్పటి వరకు పరిష్కరించినవి..


వొరిగిన స్తంభాలు	135
కెపాసిటర్ల ఏర్పాటు	470
ఇనుప స్తంభాల మార్పు	31
మధ్య స్తంభాలు	93
చెట్ల కొమ్మల తొలగింపు	212
వదులుగా ఉన్న తీగలు	135
నియంత్రికల దగ్గర ఏబీ స్విచ్‌లు	75
నియంత్రికల మరమ్మతులు	77
స్టే వైర్లు అమర్చడం	64
అవగాహన సదస్సులు	35

నిరంతరాయంగా చేపట్టనున్నాం..

- బి.శ్రీనివాస్, విద్యుత్తు శాఖ ఎస్ఈ, నిర్మల్

జిల్లాలో పొలంబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పలు సమస్యలను పరిష్కరించాం. క్షేత్రస్థాయి సందర్శనతో అవగాహన కలగడంతోపాటు అన్నదాతల ఏళ్ల నాటి ఇక్కట్లు తీరుస్తున్నాం. కెపాసిటర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ప్రత్యేకంగా కోరుతున్నాం. నిరంతరాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం.

అల్లుకున్న నిర్లక్ష్యం.. సబ్‌స్టేషనే నిదర్శనం



ఎక్కడో రోడ్డు పక్కన చెట్ల గుంపుల్లో.. జనావాసాలు లేని ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు ఎగబాకిన తీగజాతి మొక్కలు ఉన్నట్లు విద్యుత్తు శాఖ వారికి తెలియజేస్తే వెంటనే వాటిని తొలగిస్తారు. కానీ విద్యుత్తు కార్యాలయంలోనే ఇలాంటి పరిస్థితే ఎదురైనా వాటిని తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. నిర్మల్ మండలం అక్కాపూర్‌లో కొండాపూర్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్తు స్తంభానికి ఇలా తీగజాతి మొక్కలు ఎగబాకుతున్నాయి. చిత్రం : న్యూస్‌టుడే, నిర్మల్

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పరిశీలనలో వేగం పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పరిశీలనను త్వరితగతిన చేపట్టాలని జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు పాలనాధికారులు, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు సంబంధించి సరిపడా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి మాట్లాడుతూ. . జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెప్మా పీడీ సుభాష్, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు సి.వి.ఎన్.రాజు, రాజేశ్‌కుమార్, మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక, చిత్రంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్

కలిసి పనిచేస్తే ఒత్తిడి దూరం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : పనిచేసే ప్రదేశాల్లో ఉద్యోగులందరూ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి పనిచేస్తే ఎలాంటి ఒత్తిడి దరిచేరదని సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సీనియర్, జూనియర్ అనే తేడాలు చూపించకుండా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటే శారీరకంగా బలంగా ఉంటామన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి డా.అల్లాడి సురేశ్ మాట్లాడుతూ.. సమస్యలకు భయపడొద్దని, ప్రతీదానికి పరిష్కారం ఉంటుందన్నారు. అనవసర ఆందోళనతో కుంగుబాటుకు గురికావొద్దన్నారు. మానసిక ఒత్తిడితో బాధపడుతుంటే టోల్ ఫ్రీ నంబరు 14416లో ఉచిత కౌన్సెలింగ్ పొందవచ్చని సూచించారు. జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్, కార్యక్రమ అధికారి డా.శ్రీనివాస్, న్యాయవాదులు రాజలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సేవలు మరింత మెరుగు పడాలి



సారంగాపూర్‌లో ధ్రువపత్రాలు అందజేస్తున్న డీపీవో శ్రీనివాస్

సారంగాపూర్, ఖానాపూర్, న్యూస్‌టుడే : గ్రామాల్లో తాగునీటి సరఫరాతో పాటు ఇతర సేవలు మరింత మెరుగ్గా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంచి నీటి సరఫరా, మల్టీ పర్పస్ వర్కర్లకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. శిక్షణ పొందిన వర్కర్లకు మిషన్ భగీరథ తరఫున ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీఈవో అజీజ్‌ఖాన్, ఆయా శాఖల ఏఈలు తదితరులు పాల్గొన్నారు. ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శిక్షణ పూర్తిచేసుకున్న గ్రామ మంచి నీటి సహాయకులకు అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే : దూరవిద్యలో పదవ తరగతి, ఇంటర్ చదివేందుకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు లక్ష్మణచాంద ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, దూరవిద్య సమన్వయకర్త అశోక్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 31లోపు అడ్మిషన్ పొందే అవకాశం ఉందన్నారు. వివరాల కోసం లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సాగునీటి రంగానికి మొదటి ప్రాధాన్యం

లోకేశ్వరం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో సాగు నీటి రంగానికి మొదటి ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మేశ్వర ఎత్తిపోతల పథకం మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గం సస్యశ్యామలం కావాలంటే ఎత్తిపోతల పథకాలు, సుద్ద వాగు కాలువలు, చెరువులు బాగుపడాలన్నారు. అందుకే ప్రాధాన్యతాపరంగా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. బ్రహ్మేశ్వర్ ఎత్తిపోతల మరమ్మతులకు రూ.1.42కోట్లు, పంచగుడి ఎత్తిపోతల పథకంలో నియంత్రికల మరమ్మతులకు రూ.45 లక్షలు మంజూరు చేయించినట్లు వివరించారు. మండలంలోని పంచగుడి నుంచి ముథోల్ వరకు రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించామన్నారు. కమిటీ అధ్యక్షుడు రాజరెడ్డి, రాజేశ్‌బాబు, భోజన్న, చిన్నారావు, మహేందర్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.




బ్రహ్మేశ్వర ఎత్తిపోతల పథకం మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

సన్నాల కొనుగోలులో సాంకేతికత

- ప్రత్యేక పరికరంతో గుర్తింపు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సన్న రకాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సన్న రకాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాల సాగు ఎక్కువగా ఉండటంతో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు.



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

సన్న రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో వాటి సేకరణలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యతతో పాటు సన్నరకాలను సాగు చేసే రైతుల నుంచి ధాన్యం గుర్తించేందుకు సాంకేతికతను పాటించనున్నారు. ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తించింది. జిల్లాల వారీగా అక్కడి నేల, వాతావరణం, సాగు నీటి సౌకర్యం తదితర వాటి మేరకు మంచిర్యాల జిల్లాలో 1008, సాయిరాం, చిట్టిపొట్టి రకాలు, నిర్మల్ జిల్లాలో జైశ్రీరాం, సూపర్‌అమాన్, హెచ్‌ఎంటి రకాలు సాగు చేస్తుండగా, కుమురం భీం జిల్లాలో శ్రీ101, జైశ్రీరాం, ఆర్ఎన్ఆర్ రకాలు సాగు చేస్తున్నారు. వీటిని గుర్తించేందుకు ఈ సీజన్‌లో గ్రెయిన్‌కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. కేంద్రానికి రెండు పరికరాల చొప్పున ఇవ్వనున్నారు. ఈ యంత్రంతో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు. ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నా.. కొనుగోలు చేసిన తర్వాత సంచులను సులువుగా గుర్తించేందుకు సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.



గ్రెయిన్‌కాలిపర్

నిర్ధారణే సమస్య

వరి ధాన్యం సేకరణలో సన్నధాన్యం నిర్ధారణే సమస్యగా ఉంది. నిబంధనల మేరకు బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మి.మీలకు మించకుండా, పొడవు, వెడల్పు నిష్పత్తి, 2.5 కన్నా ఎక్కువ ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నాణ్యత పరీక్ష కోసం పొట్టు తీసిన గింజలను తేమ శాతం 17 శాతం కన్నా తక్కువ ఉన్న పరిస్థితుల్లోనే నిర్ధారించాలి. ఇప్పటి వరకు కేంద్రం ఏ, బీ రకాలంటూ మద్దతు ధరలను ప్రకటించింది. సన్న రకాలను ప్రభుత్వం సేకరించేది కాదు. మార్కెట్లో ధర తక్కువగా ఉంటే దొడ్డు రకాల మాదిరిగానే సన్న రకాలను రైతులు విక్రయించుకునే పరిస్థితి ఉండేది. ఈ సీజన్‌లో తొలిసారి సన్నరకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

Rc.No.1796/PLG/2024 **తెలంగాణ ప్రభుత్వం** Date: 10-10-2024

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయము- నిర్మల్ జిల్లా

GENERAL NURSING & MIDWIFERY (GNM) 3 yrs ADMISSION NOTIFICATION 2024-25 డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ హైదరాబాద్ వారి Rc.No. 17944/N1/2024, తేది 28-09-2024 ప్రకారం 2024-25 సంవత్సరం కొరకు తెలంగాణ ప్రభుత్వంచే గుర్తించబడిన నాగార్జున స్కూల్ ఆఫ్ నర్సింగ్, నిర్మల్ నందు జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ 3 సంవత్సరముల (GNM స్టాఫ్ నర్స్) కోర్సుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

నర్సింగ్ స్కూల్ పేరు	కోర్సు	విద్యార్హత	మొత్తం సీట్లు	ప్రభుత్వకోట	మేనేజ్మెంట్ కోట
నాగార్జున స్కూల్ ఆఫ్ నర్సింగ్	GNM 3 Yrs	ఇంటర్ ఏదైనా గ్రూప్	60	36	24

ఇందిరానగర్, నిర్మల్, సెల్: 9505209200, 7337553556, 9010092333

దరఖాస్తు చేయు విధానం: దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా దాఖలు చేయుటకు చివరి తేది 17.10.2024 వరకు చేసుకోవలెను. ఆన్లైన్ ద్వారా నింపిన దరఖాస్తు ఫారాన్ని డౌన్లోడ్ చేసుకొని మరియు మీ యొక్క సంబంధిత, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతపరిచి 19.10.2024 సాయంత్రం 5 గంటల వరకు DM & HO గారి Office నిర్మల్ నందు లేదా నాగార్జున స్కూల్ ఆఫ్ నర్సింగ్ నిర్మల్ నందు సమర్పించవలెను. వెబ్‌సైట్ అడ్రస్: http://dme.telangana.gov.in రూ.300/-ల చాలన్ ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఈ క్రింద చూపబడిన హెడ్ ఆఫ్ అకౌంట్ కు 17-10-2024 వరకు జమ చేసి దరఖాస్తులతో పాటు సమర్పించవలెను.


0210 - Medical & Public Health
MH 105- Allopathy
001 Other receipts,
03- Medical Education Training & Research
SH (81)- Other receipts,
DDO Code is 25000902022

గమనిక: 1. లాంగ్వేజ్ మినహా గ్రూప్ సబ్జెక్టులలో అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా కేవలం మెరిట్ మీద మాత్రమే ఎంపిక చేయబడును. 2. మెరిట్ నిర్వహించేటప్పుడు కంపార్ట్మెంట్ లో ఉత్తీర్ణులైన వారి కంటే రెగ్యులర్‌గా పాసైన వారిని పరిగణలోకి తీసుకోబడును. మరియు ఈ సంవత్సరంలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైన వారిని మొదటి ప్రాధాన్యతగా తీసుకొనబడును. 3. ప్రభుత్వ కోటా సీట్లను జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నియమ నిబంధనల ప్రకారం ఎంపిక చేయబడును, మరియు మేనేజ్‌మెంట్ కోటా సీట్లను సంబంధిత ఇనిస్టిట్యూషన్ వారు ఎంపిక చేయబడును. 4. సంబంధించిన డాక్యుమెంట్లు, ధృవీకరణ కాపీలు లేకుండా దాఖలు చేసిన అసంపూర్తి దరఖాస్తులు అంగీకరించబడవు. 5. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వంచే జారీ చేయబడిన కుల మరియు ఈ సంవత్సర ఆదాయ ధృవీకరణ పత్రములను జతపర్చవలెను. 6. తెలంగాణ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడుతాయి. 7. అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మరియు ఓబీసీ కులాల అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు.

సం/- డి.యం. & హెచ్.ఓ,
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయము, నిర్మల్.

అపురూపం.. సీతాకోక చిలుకల అందం



ఒక్కటిగా సీతాకోక చిలుకలు


చూడముచ్చటగా..

● బుగ్గ ఆలయ సమీపంలో పార్కు ఏర్పాటుకు చర్యలు

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట సెక్షన్ పరిధి బుగ్గ ఆలయం సమీపంలో సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక సీతాకోక చిలుకలను గుర్తించినట్లు చెప్పారు. అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న ఆలయాలు, పురాతన నిర్మాణాల ప్రదేశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో రంగురంగుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చేవారు వీటిని చూస్తూ మురిసిపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్‌ను సంప్రదించగా 'బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారు బుగ్గ ఆలయం రెండు గుట్టల నడుమ 2 వేల ఏళ్ల కిందట వెలిసిందని పూర్వీకులు చెబుతున్నారు. దీన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు అనువైన వనరులు ఉన్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటునకు ప్రణాళిక సిద్ధం చేశాం. త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం' అని తెలిపారు. - న్యూస్‌టుడే, కాసిపేట


ఆకట్టుకునేలా..


నీటకుంట వద్ద గుంపులుగా..

మహాగౌరి అవతారం.. పులకించిన భక్తజనం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


మహాగౌరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు మహాగౌరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొగుటా మాదవనంద సరస్వతీ స్వామి దర్శించుకొని పూజలు చేశారు. ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు వీణ వాయించారు. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ విద్యార్థులు


విద్యార్థులతో ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, న్యూస్‌టుడే : అసోం రాష్ట్రంలోని గువహటి త్వరలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లాలోని బాసర నాగభూషణ విద్యాలయం విద్యార్థులు ఎం.చరణ్, డి.అవినాష్‌లు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచి జాతీయస్థాయిలో పాల్గొననున్నారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ ముధుల్కర్, యోగా మాస్టర్ మల్లేశ్, స్కూల్ ప్రిన్సిపల్ బాబురావు వైస్ ప్రిన్సిపల్ సులోచన, నేత్ర వైద్యుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

నేడు నాందేడ్ నుంచి ఆమ్లాకు ప్రత్యేక రైలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ధమ్మ పరివర్తన దినోత్సవం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని పురస్కరించుకొని శుక్ర, శనివారాలు నాందేడ్-ఆమ్లా-నాందేడ్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ప్రత్యేక రైలు(నెం.07025) నాందేడ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి ముద్ఖేడ్, భోకర్, హిమాయత్‌నగర్, సహస్రకుండ్, కిన్వట్, ఆదిలాబాద్, పిప్పల్‌కుటి, నాగ్‌పూర్, ఆమ్లాకు శనివారం ఉదయం 11 గంటలకు చేరుకుంటుందన్నారు. శనివారం ప్రత్యేక రైలు(నెం.07026) ఆమ్లా నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో అవే స్టేషన్‌ల ద్వారా ఆదివారం ఉదయం నాందేడ్ చేరుకుంటుందన్నారు. ప్రత్యేక రైలులో 17 జనరల్ బోగీలతో కలిపి మొత్తం 19 కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

అవ్వను అవి అవసరమే..!!

● వృత్తులు.. పద్ధతులు పిల్లలకు తెలిసుండాలి

మామడ, న్యూస్‌టుడే:
చదువుల నిమిత్తం పిల్లలు చిన్నప్పటి నుంచే వసతిగృహాల్లో ఉంటున్నారు. సెలవులొచ్చినా ప్రత్యేక తరగతుల పేరిట అక్కడే ఉండిపోతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు సొంతూరుకొచ్చినా తల్లిదండ్రులు పని ఒత్తిడి వల్ల వారితో గడపలేకపోతున్నారు.. అమ్మానాన్నలతో పిల్లలకు ఉండాల్సిన ఆత్మీయతలో అంతరం కనిపిస్తోంది. పండగల వేళ, ఇతర సమయాల్లో ఇంటికొచ్చినప్పుడు వాళ్లతో ఎక్కువ సమయం గడపడం, తల్లిదండ్రుల వృత్తి, ఉద్యోగాలపై అవగాహన కల్పించడం వంటివి ఎంతో అవసరం..

ఇదే కదా ప్రధానమని..

నిర్మల్‌లో నివాసముండే మన్మోహన్‌రెడ్డి స్వగ్రామం సారంగాపూర్ మండలం చించోలి. సొంతూరులో సేంద్రియ, గోఆధారిత వ్యవసాయంలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. వారికి ఇతర వ్యాపారాలున్నా సాగుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. తమ ఉన్నతిలో వ్యవసాయానిదే ప్రధాన పాత్ర అని చెప్పే మన్మోహన్‌రెడ్డి సెలవుల్లో కుమారుడు కృషిల్‌రెడ్డిని చేనుకు తీసుకెళ్తారు. సాగు విధానాన్ని చెబుతుంటారు. తోటకు తీసికెళ్లి ఆవులు, ఇతర జీవాలతో సాగుకు ఉన్న అనుబంధాన్ని ఓ పాఠంలా వివరిస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఆ చిన్నోడికీ ఇప్పటి నుంచే చేనుచెలకలపై ఆసక్తి పెరిగింది.


చేనులో తండ్రి మన్మోహన్‌రెడ్డితో కృషిల్

ఉల్లాసంగా ఉత్సాహంగా..

మామడ మండలం గాయిద్‌పల్లికి చెందిన రమేష్ రాఠోడ్ ఉత్తరాఖండ్‌లోని ఓఎన్‌జీసీ ఫైనాన్స్ విభాగంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు ధనుష్ ఐఐటీ గువహటిలో బీటెక్, కుమార్తె ఈశిత డెహ్రాడూన్‌లో పదో తరగతి చదువుతున్నారు. వీలున్నప్పుడల్లా సొంతూరుకు వెళ్తాం.. ప్రకృతిలో గడిపేందుకు ఆసక్తి చూపిస్తాం. మా సంప్రదాయ వస్త్రధారణను పిల్లలు ఇష్టపడేలా చూస్తాం. చేలకు తీసికెళ్లి పంటల సాగుపైనా అవగాహన కల్పిస్తామని తల్లిదండ్రులు రమేష్-రూప సొంతూరిపై మమకారాన్ని, పిల్లలకు మూలాలు తెలియజేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.


సెలవులకు సొంతూరుకొచ్చినప్పుడు పిల్లలతో రమేష్ రాఠోడ్-రూప దంపతులు

పనులన్నీ రావాలి కదా..

నిర్మల్ పట్టణం గాయిద్‌పల్లికి చెందిన రవీందర్-నీల దంపతుల పెద్ద కూతురు హిమబిందు ప్రయాగరాజ్ ట్రిపుల్ ఐటీలో, చిన్న కూతురు సింధూజ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి వసతిగృహాల్లో ఉంటున్నారని.. సెలవులకు ఇంటికొస్తే వారి పనులు వారు చేసుకునేలా చూస్తానంటున్నారు తల్లి నీల. వంటలు, ఇతర పనులు నేర్చుకునేలా ప్రోత్సహిస్తుంటామని చెప్పారు. అన్ని పనులు తమకు కూడా ఆనందమే కదా అంటుంటారు ఆ పిల్లలు.


కూతురు సింధూజతో వంట చేయిస్తున్న తల్లి నీల

వృత్తిపై అవగాహన ఉండాలని..


తమ తండ్రులు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుంటే చూస్తున్న పిల్లలు

మామడ మండలం దిమ్మదుర్తికి చెందిన రేవెల్లి శ్రీనివాస్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్ వృత్తిరీత్యా గీత కార్మికులు. ఊళ్లోని తాటి చెట్లు గీస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లలు అచ్యుత్‌గౌడ్, మనూష హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నారు. దసరా సెలవులకు ఇంటికొచ్చిన ఆ ఇద్దరినీ అలా తాటి వనానికి తీసికెళ్లి నిత్యం వారు చేసే పనిని ప్రత్యక్షంగా చూపించడం, తాతల కాలం నుంచి ఉపాధి ఇస్తున్న ఆ రంగం గురించి వివరించారు. కులవృత్తులు కనుమరుగవుతున్న తరుణంలో ముందుచూపుతో చేసే ఇలాంటి చిన్న పాటి పనులతో వచ్చే తరాలకూ వృత్తి ప్రాధాన్యం తెలిసొస్తుందన్నది వారి అంతరంగం..

ఆలోచించాల్సిన విషయం ఇది..



పరీక్ష పత్రాలను దిద్దుతున్న ఓ ఉపాధ్యాయురాలు ఒక విద్యార్థి రాసిన సమాధానం చూసి కన్నీళ్లు పెట్టుకుంటారు. 'మీరు ఏం కావాలనుకుంటున్నారు' అనే వ్యాసరచన అంశంపై ఓ విద్యార్థి 'నేను స్మార్ట్‌ఫోన్ అవ్వాలి అని రాస్తాడు. ఆ విద్యార్థి అమ్మానాన్నలు సెల్‌ఫోన్‌ను చాలా ప్రేమిస్తారు. దానిని శ్రద్ధగా ఇష్టంగా చూసుకుంటారు. నాన్న ఆఫీసు నుంచి వచ్చినప్పుడు స్మార్ట్‌ఫోన్ రిలాక్స్ ఇస్తుంది. ముఖ్యమైన పనుల్లో ఉన్నా ఫోన్ రింగ్ అవ్వగానే జవాబు ఇస్తారు. నేను పిలిచినా పట్టించుకోరు... తల్లిదండ్రులు చరవాణిలో నిమగ్నమై పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నది ఆ వ్యాసంలోని సారాంశం.. ఇది ఎప్పటి నుంచో వైరల్ అవుతోంది. చాలా మంది ఇళ్లలో కనిపించే ఈ అంతరం కనిపిస్తోంది.



కప్పుకొన్న మంచు దుప్పటి

రెండు రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం కాస్త ఎండ కాస్తూనే.. మధ్యాహ్నం వర్షం కురుస్తోంది. రాత్రి వేళ చలి ప్రారంభమై తెల్లవారుజామున మంచు కురుస్తోంది. ఆదిలాబాద్ పట్టణాన్ని గురువారం ఉదయం మంచు కమ్మేసింది. - ఈనాడు, ఆదిలాబాద్

ముఖ్యమంత్రిని కలిసి.. సమస్యలు విన్నవించి

ఆసిఫాబాద్, ఉట్నూరు గ్రామీణం న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సమస్యలు, ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరుతూ.. హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి వినతిపత్రం అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల పరిరక్షణ, చట్టాల అమలు, జైనూర్ ఘటన బాధితురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గతంలో మంజూరైన డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, సీడీపీ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సత్తు మల్లేష్ తదితరులు ఉన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నిండుగా జలాలు.. కళకళలాడుతున్న పొలాలు


పొలాలకు సాగునీటినందించే ప్రధాన కాలువ

● 29 టీఎంసీల నీరు గోదావరి పాలు

కడెం, న్యూస్‌టుడే : కడెం నారాయణరెడ్డి జలాశయం ఆయకట్టు పరిధిలోని ఆరు మండలాల రైతులకు కల్పతరువు. కడెం నిండిందంటే ఆ ప్రాంత రైతుల ఆశలు పండినట్లే. కడెం బాగుండాలని, నిండా నీరుండాలని ఆయకట్టు రైతులు కోరుకుంటుంటారు. ఈ వానాకాలం రైతుల కళలు పండేలా ప్రాజెక్టు ఆశాజనకంగా నిండడమే కాకుండా అదనంగా వచ్చిన నీటిని దిగువకు వదిలారు. అక్టోబరు మొదటి వారం ముగిసినా జలాశయంలో గరిష్ఠ మట్టానికి చేరువగా నీటిమట్టం ఉండటంతో వారబందీ నిబంధనలేవీ పెట్టకుండానే అధికారులు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో కాలువలకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 700.7 అడుగుల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కుల వరకు మాత్రమే వస్తోంది.

ఎదుగుతున్న చేలు

కడెం కాలువల ద్వారా పొలాలకు నిరంతరంగా సాగునీరందుతోంది. ప్రాజెక్టు నిండా జలాలు ఉండటంతో చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. మాకు నీరు రాలేదనే ఆరోపణలేమీ లేకుండా రైతుల పొలాలు ఎదుగుతున్నాయి. కాలువల్లో గలగలా నీరు పారుతుంటే పంట పొలాలు కళకళలాడుతూ ఏపుగా ఎదుగుతున్నాయి. ప్రాజెక్టు కింద మొత్తం 60 వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్లు అధికారుల అంచనాగా ఉంది. ప్రధాన కాలువకు ఉన్న 42 ఉపకాలువల ద్వారా పొలాలకు సాగునీరందుతోంది. పొలాలన్నీ పొట్ట దశలో ఉండగా మరికొన్ని పొలాలు గొలకలు వేస్తున్నాయి. అక్కడక్కడ తెగుళ్లు సోకిన పొలాలకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటూనే దిగుబడిపై ఆశలు పెంచుకుంటున్నారు.

నాలుగింతల నీరు గోదావరికి..

కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు. ఈ వర్షాకాలం ప్రారంభం నుంచి కడెంకు మొత్తం 41 టీఎంసీల వరదనీరొచ్చింది. అందులోంచి వరద గేట్ల ద్వారా 29.088 టీఎంసీల నీటిని గోదావరికి వదిలారు. అంటే సుమారు కడెంలో నిల్వ ఉండే నీటికి నాలుగింతల నీరు గోదావరికి వదిలారన్నమాట. కాలువలకు ఇతరత్రా 4.8 టీఎంసీల నీటిని విడుదల చేశారు ప్రస్తుతం కడెంలో 7.511 టీఎంసీల నీరుంది. గతేడాదికంటే ఇపుడు నీటిమట్టం ఆశాజనకంగానే ఉండటంతో వానాకాలం పంట పూర్తయ్యాక రెండో పంటకూ సగం ఆయకట్టుకైనా నీరందుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.


కడెం కింద సాగవుతున్న పొలాలు

విరుల పండగ.. లాభాలు దండిగా..

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ప్రకృతిని, పూలను దేవతలుగా కొలుస్తూ పల్లె, పట్నం అనే తేడా లేకుండా.. కొనసాగే పండగ బతుకమ్మ. రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మగా పేర్చి, మహిళలు ఒక చోట చేరి ఆటపాటలతో సాగుతుంది. మరో వైపు వరుసగా దసరా, దీపావళి, ఆ తర్వాత కార్తికమాసం పూజలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో ఈ నెల నుంచి మరో రెండు నెలల పాటు పూలకు డిమాండ్ బాగా ఉంటుంది. బంతి, చామంతి కిలో రూ.100 వరకు ఉన్నాయి. పండగలు, శుభకార్యాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొంత మంది రైతులు పూలను సాగు చేసి లాభాలను గడిస్తున్నారు. ఇతర రైతులకు భిన్నంగా పూల సాగుకు ప్రత్యేకంగా కొంత భూమిని కేటాయించడంతో పాటు సీజన్ల వారీగా పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



ఎకరం తోటలో పది టన్నులకు పైగానే..

పూల తోటలు సాగు చేసే రైతులు లాభాలు గడిస్తున్నారు. ఎకరం భూమిలో బంతి పూల సాగుకు రూ.40 వేలు పెట్టుబడి అవుతుండగా, పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. సీజన్‌లో కిలో రూ.100కు పైగా ధర ఉంటుంది. రైతులు రోజు వారీగా పూలు తెంపి స్థానిక మార్కెట్లో విక్రయిస్తే లాభం ఉంటుంది. టోకులో విక్రయిస్తే కిలో ధర రూ.60 ఉంటుంది. డిమాండ్‌ను బట్టి పండగల సమయంలో ధర ఇంకా ఎక్కువే ఉంటుంది. జిల్లాల వారీగా పూలు సాగు చేసే రైతులు తక్కువ సంఖ్యలో ఉండటంతో స్థానిక మార్కెట్లో విక్రయిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు.



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన రైతు శ్రీకాంత్ బంతి పూలు సాగు చేస్తున్నారు. పూల డిమాండ్‌ను బట్టి దిగుబడి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకొని సాగు చేయడం వల్ల ఆశించిన లాభాలు గడించే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక మార్కెట్లో విక్రయించేలా ఏర్పాట్లు చేసుకొని అధిక లాభం పొందుతున్నారు.

● తక్కువ ఖర్చు.. రోజువారీ ఆదాయం



☛ కుమురం భీం జిల్లా దహెగాం మండలం పి.పి.రావు కాలనీకి చెందిన రైతు సురేష్ మల్చింగ్ పద్ధతిలో పూల సాగు చేస్తున్నాడు. ఎకరం భూమిలో రెండు రకాల బంతి పూలు సాగు చేస్తున్నారు. సరిగ్గా బతుకమ్మ పండగ వచ్చే సరికి దిగుబడి వచ్చేలా చూసుకుంటారు. ఎకరానికి పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. పూలను విక్రయించడానికి ఎక్కడికి వెళ్లే అవసరం లేదు. తోట దగ్గరికే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారని వివరించారు.



☛ ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారికి చెందిన రైతు దేవిదాస్ తనకు ఉన్న భూమిలో రెండు ఎకరాల్లో కూరగాయలు, పూలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ పండగ సమయంలో పూలకు ఎక్కువ డిమాండ్ ఉండటం, పైగా ఆదిలాబాద్ జిల్లాలో ఈ పండగ నెల రోజులు కొనసాగుతుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా దిగుబడి వచ్చేలా వారం రోజుల తేడాతో విత్తుకోవడంతో రోజు వారీగా పూల విక్రయాలుండటంతో లాభాలు గడించే అవకాశం ఉందని దేవిదాస్ తెలిపారు.



☛ నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లికి చెందిన ఆర్.మహేశ్ ఎకరం భూమిలో పూలు సాగు చేస్తున్నాడు. బతుకమ్మ పండగ సమయానికి బంతిపూలు వచ్చేలా జూన్ నెలలో పంట సాగును ప్రారంభిస్తే.. సెప్టెంబరు నుంచి దిగుబడి మొదలవుతుందని తెలిపారు. చాలా మంది చేను దగ్గరికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతుంటారని, ఎక్కువ దిగుబడి వస్తే.. నిజామాబాద్ మార్కెట్లో విక్రయిస్తామని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పూల సాగు(ఎకరాల్లో)




బంతి	చామంతి	మల్లె	లిల్లి
258	115	68	52

అల్లుడి మరణం తట్టుకోలేక.. అత్త హఠాన్మరణం


వచ్చలబాయి

భీంపూర్, న్యూస్‌టుడే : రెండు రోజుల కిందటే అల్లుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆ మరణం తట్టుకోలేక అత్త హఠాన్మరణం చెందిన ఘటన కరంజి-టిలో విషాదం నింపింది. రెండు రోజుల వ్యవధిలో ఒకే ఇంట ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం నిండింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గ్రామానికి చెందిన కర్నెవార్ గణేష్ మంగళవారం మృతి చెందిన సంగతి తెలిసిందే. భార్య కవిత తల్లి వచ్చలబాయి(75) భర్త చనిపోవడంతో ఏళ్లుగా కూతురు-అల్లుడి ఇంట్లో ఉంటోంది. అల్లుడి మరణంతో కూతురు, ఆమె పిల్లల భవితవ్యంఎలాగోనని రెండు రోజులుగా రోధిస్తోంది. గురువారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కూర్చున్న చోటనే కుప్పకూలి చనిపోయింది.

ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌గా శేఖర్



నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఛైర్మన్‌గా నిర్మల్ పట్టణానికి చెందిన కొట్టె శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘ బలోపేతానికి కృషిచేస్తానని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఆర్టీసీ డ్రైవర్ అదృశ్యం.. కేసు నమోదు

భైంసా, న్యూస్‌టుడే : ఆర్టీసీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ఎండీ.గౌసొద్దీన్ కథనం మేరకు... పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన శామంతుల సుదర్శన్ భైంసా ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తెలిసిన వారి వద్ద రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు అలవాటు పడ్డాడు. ఆదాయానికి మించి అప్పులు కావడంతో తీర్చలేని పరిస్థితుల్లో ఏడాది క్రితం ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు గమనించి కాపాడారు. ఈ క్రమంలో ఉదయం కనిపించకుండా పోవడంతో కుటుంబీకులు డ్యూటీకి విధులకు వెళ్లాడని భావించారు. కాగా ఇంట్లోనే చరవాణి వదిలి, 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నా. నా మరణానికి ఎవరూ కారణం కారు'. ఈ విధంగా సూసైడ్ నోట్ రాసి పెట్టి వెళ్లి పోయాడు. భార్య అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భాజపా నాయకులపై..

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : నిరసనలో భాగంగా బల్దియా కార్యాలయ ఆవరణలో చెత్త పడేసిన పలువురు భాజపా నాయకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పొరుగుసేవల సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం పట్ల నిరసన వ్యక్తంచేస్తూ భాజపా ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలో చెత్తను సేకరించి కార్యాలయ ప్రాంగణంలో పడేశారు. కార్యాలయ ఉద్యోగులు, వినియోగదారులకు ఇబ్బంది కలిగించే రీతిలో వ్యవహరించారంటూ మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాయకులు రావుల రాంనాథ్, సాదం అరవింద్, ఎడిపెల్లి నరేందర్ తదితరులపై కేసు నమోదుచేశామని సీఐ వివరించారు.

గోదాంను ప్రారంభించిన అదనపు కలెక్టర్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఫైజాన్ అహ్మద్, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మస్కాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 500 మెట్రిక్ టన్నుల గోదాంను గురువారం నిర్మల్ జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్‌లు శ్రీనివాస్, రమేష్ రావు, పాకాల రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జడ్జి నేతృత్వంలో కమిషన్ వేయాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం నియమించిన వన్‌మెన్ కమిషన్‌ను రద్దుచేసి విశ్రాంత జడ్జి నాయకత్వంలో అయిదుగురు సభ్యులతో ఏర్పాటు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి జిల్లా కన్వీనర్ రంజిత్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు వెంకటస్వామి, రాజేశ్వర్, అడెల్లు, గంగన్న, బోస్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందిస్తున్న కృష్ణంరాజు

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

ఖానాపూర్ : పట్టణంలోని విద్యానగర్ పద్మశాలీ సంఘం భవనంలో ఖానాపూర్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు ఓకేఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఒడ్డేపల్లి కృష్ణం రాజు దసరా సందర్భంగా వస్త్రాలను స్వచ్ఛ కార్మికులకు అందజేశారు.

కాన్షీరాం ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రవీందర్

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : కాన్షీరాం ఆశయాల సాధనకు ధర్మ సమాజ్ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రామగిరి రవీందర్ అన్నారు. గురువారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ ట్యాంక్ బండ్ డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యం కోసం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సుధాకర్, భూమేశ్, శేఖర్, వినోద్, శాంతన్, అరవింద్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ రాజు మహారాజ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మస్కాపూర్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సైదారావు

ఖానాపూర్ గ్రామీణం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. తమలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని సీఐ సైదారావు సూచించారు. గురువారం మండలంలోని మస్కాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మొదటి స్థానంలో నిలిచిన ఈగల్స్ జట్టుకు రూ.10 వేలు, రెండో స్థానం సాధించిన టైటాన్స్ జట్టుకు రూ.5 వేలు ప్రైజ్‌మనీ, బహుమతులను అందజేశారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కంటి పరిరక్షణ అత్యంత ముఖ్యం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : కంటి పరిరక్షణ అత్యంత ముఖ్యమని పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు అన్నారు. గురువారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ ట్యాంక్ బండ్ డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ముథోల్ భోస్లే గోపాల్‌రావు పటేల్ కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ నిర్మల్ శాఖ సంయుక్తంగా చేపట్టారు. కళ్ల రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ కృష్ణంరాజు, సురేశ్, దీప్తి, వైద్య సహాయకులు రవికుమార్‌రెడ్డి, నవీద్ అహ్మద్ నురాని, లయన్స్ క్లబ్ నిర్మల్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, జోన్ ఛైర్మన్ లక్కిడి రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుల అరెస్టు సరికాదు

ఖానాపూర్ : చెన్నై శివారులో తమ యూనియన్‌ను గుర్తించాలని సమ్మె చేస్తున్న వెయ్యిమంది కార్మికుల పట్ల ప్రైవేటు కంపెనీ దురుసుగా వ్యవహరించడం, 11 మంది కార్మికనేతలను తమిళనాడు ప్రభుత్వం అరెస్టు చేయడం సరికాదని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేష్ అన్నారు. యూనియన్ నాయకులపై కేసు ఎత్తివేసి, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సహచర ఉద్యోగుల ఆర్థిక సాయం

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఈజీఎస్ క్షేత్రసహాయకుడు గైని రాందాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సహచర ఉద్యోగులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆ బాధిత కుటుంబ సభ్యులకు గురువారం రూ.41,000 ఆర్థిక సాయం అందజేశారు.

మది నిండుగ.. బతుకమ్మ పండగ



దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలకు బతుకమ్మను తీసుకుని వెళుతున్న గల్ఫ్ తెలంగాణ ఫోరం ప్రధాన కార్యదర్శి తేలు వెంకటేశ్-వాణి దంపతులు



లోలంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నిమజ్జనానికి బతుకమ్మలతో బయలుదేరిన మహిళలు



రేవోజిపేటలో బతుకమ్మ పేర్చుతున్న మహిళలు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: విదేశాలలోనూ మన తెలుగు వారు సంస్కృతి, సంప్రదాయలను చాటుతూ పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దుబాయ్‌లోని గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించినట్లు ఫోరం ప్రధాన కార్యదర్శి, లోకేశ్వరం మండలం పిప్రి వాసి తేలు వెంకటేశ్ తెలిపారు.

దస్తూరాబాద్, దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని గొడిసిర్యాల, రేవోజిపేట, బుట్టాపూర్, రాంపూర్ గ్రామాల్లో గురువారం బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను చేసి అందులో ఉంచారు. నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించుకొని, ఆడి పాడి సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను చెరువులలో సాగనంపారు. దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.



శాస్త్రినగర్ హనుమాన్ ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఇంద్రనగర్‌లో బతుకమ్మ వద్ద కోలాటం వేస్తున్న ఆడపడుచులు



నడింపల్లెలో జాన్సన్ నాయక్..



మున్యాల్‌లో భోనాల ఎదుర్కోలులో ఒగ్గు కళాకారుల విన్యాసాలు



విరోలిలో దుర్గామాతకు హారతిస్తున్న భక్తులు

దుర్గమ్మా.. కరుణించమ్మా

నిర్మల్, లక్ష్మణచాంద, ముథోల్, ఖానాపూర్ గ్రామీణం, దస్తూరాబాద్, నిర్మల్ గ్రామీణం, దిలావర్‌పూర్, సారంగాపూర్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు దుర్గాదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీ నగరేశ్వర శివాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత ఆవరణలో గురువారం దుర్గాహోమం నిర్వహించారు. పండితుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పలు చోట్ల ఒగ్గు కళాకారుల డప్పుచప్పుళ్ల మధ్య అమ్మ వారికి బోనాలు ఎదుర్కొని మండపానికి తీసుకువచ్చి సమర్పించారు.



మంజులాపూర్‌లో దుర్గామాత పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



సారంగాపూర్‌లో చండీయాగం



దిలావర్‌పూర్‌లో దుర్గామాత వేషధారణలో చిన్నారులు



నర్సాపూర్ (జి)లో.. హోమంలో పాల్గొన్న భక్తులు



పాత మద్దిపడగలో అమ్మవారి సన్నిధిలో దీపారాధన, పూజలు



వెంకటేశ్వర స్వామి పల్లకిసేవ, మంగళహారతులతో మహిళల స్వాగతం

నేత్ర పర్వం.. వెంకన్న స్వామి దర్శనం

ఖానాపూర్, న్యూస్‌టుడే : ఖానాపూర్ పట్టణంలో ఏటా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వేంకటేశ్వర స్వామి సతీ సమేత, ఆంజనేయసహిత స్వామి వారి పల్లకిసేవ పట్టణ ప్రదక్షిణ వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో కాలనీచొప్పున పల్లకీ సేవను నిర్వహిస్తున్నారు. పల్లకిముందే కర్రలకు ట్యూబ్‌లైట్లు చేతబూని భక్తులు పల్లకిని ముందుకు కదిలిస్తూ భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు.

బాసరలో మండల విద్యాధికారి కార్యాలయం ప్రారంభం



ఎంఈఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎస్సై గణేశ్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : బాసరలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మండల విద్యాధికారి కార్యాలయాన్ని ఎంపీడీఓ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మైసాజీని ఎంపీడీఓ అశోక్‌కుమార్‌తో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయనను కుర్చీలో కురోబెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సై గణేశ్, మాజీ సర్పంచి లక్ష్మణ్‌రావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ట్యాంకులో కోతి కళేబరం

కుభీరు, న్యూస్‌టుడే : మండలంలంలోని నిగ్వా గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకులో కోతి కళేబరాన్ని స్థానికులు ఆలస్యంగా గుర్తించారు. కోతి ట్యాంకులో పడి మృతి చెందినా పంచాయతీ అధికారులు గుర్తించకపోవడం.. ఆ నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేయటంపై స్థానికులు మండిపడుతున్నారు. కుళాయి ద్వారా సరఫరా అవుతున్న నీరు వాసన రావటంతో స్థానికులు పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. జీపీ కార్మికులు ట్యాంకు ఎక్కిచూడగా చనిపోయి వానరం కనిపించింది. వెంటనే దాన్ని బయటకు తీశారు. ఇదే విషయమై ఎంపీడీఓ నవనీత్‌కుమార్‌ను సంప్రదించగా గురువారం ట్యాంకును శుద్ధి చేసినట్లు, నీటిలో వ్యర్థాలు పడకుండా జాలిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

నిమజ్జనోత్సవానికి ఎస్పీకి ఆహ్వానం

భైంసా: పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాతల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించాలని హిందూ ఉత్సవ సమితి నాయకులు జిల్లా ఎస్పీ జానకి షర్మిలను కోరారు. ఈ మేరకు గురువారం ఆమెను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

డీజేలకు అనుమతి లేదు

భైంసా గ్రామీణం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత నిమజ్జనం రోజు డీజేలకు అనుమతి లేదని భైంసా గ్రామీణ సీఐ ఎం.నైలు అన్నారు. పట్టణంలోని గ్రామీణ పోలీసు ఠాణాలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గామాత శోభాయాత్రను, దసరా పండుగను, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

కేసుల నమోదు

లోకేశ్వరం: మండల కేంద్రం లోకేశ్వరంలో బుధవారం రాత్రి బతుకమ్మ నిమజ్జనంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దాలతో డీజేలను ఏర్పాటు చేసినందుకు 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని గాంధీ విద్యాలయంలో చదివిన 2003-04 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గురువారం కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకునానరు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

కరపత్రాల విడుదల

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో శనివారం విజయదశమి(దసరా) సందర్భంగా రాంలీలా మైదానంలో రావణ వధ కార్యక్రమం ఉంటుందని హిందూ ఉత్సవ సమితి నాయకులు తెలిపారు. పట్టణంలో దుర్గాదేవీ మండపం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 14న సద్దుల బతుకమ్మ నిమజ్జనం చేసుకోవాలని నిర్ణయించారు.

కొండచిలువ కలకలం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ సమీపంలోని పంట పొలాల్లో కొండ చిలువ కలకలం రేపింది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సతీష్ ఉదయం పొలానికి వెళ్లగా అక్కడ కొండ చిలువ కనిపించింది. స్థానిక రైతుల సహాయంతో దాన్ని చంపివేశారు. సుమారు ఎనిమిది అడుగుల పొడవు ఉన్నట్లు తెలిపారు.



రాచాపూర్‌లో కొండ చిలువను చూపిస్తున్న రైతు

విద్యార్థినికి అభినందన

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ద్యాగవాడకు చెందిన పూదరి సరిత- అరవింద్ దంపతుల కుమార్తె నేహ ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. గురువారం నిర్మల్‌లోని ద్యాగవాడ ఆంజనేయ మున్నూరుకాపు యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానించి అభినందించారు.

సోయా కొనుగోలుకు డిమాండ్

లక్ష్మణచాంద: సోయా పంటను అమ్ముకునేందుకు దళారులే దిక్కయ్యారని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సోయా కొనుగోలు చేయాలని మండల రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.4,892 ఉంటే, దళారులు రూ.4 వేల నుంచి రూ.4200 చెల్లిస్తున్నారని వాపోయారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

సారంగాపూర్: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులకు చోటు దక్కినట్లు ఆ శాఖ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారెడ్డి కృష్ణ, బేర పరమేశ్వర్‌లు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా సంజీవ్‌రావు, పోశెట్టి, సుభాష్, అమర్ సింగ్, మాణిక్యం, రఘునాథ్‌లు నియామితులు కాగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గంగారాం, హనుమండ్లు ఎన్నికైనట్లు వెల్లడించారు.

మూడు నెలల చిన్నారికి శస్త్ర చికిత్స

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ పట్టణం డాక్టర్స్ లేన్‌లోని స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూడు నెలల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. గురువారం స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడారు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే కిడ్నీలో సమస్య మొదలయ్యింది. ప్రసవం తర్వాత సమస్య మరింత పెరిగింది. నొప్పిని తట్టుకోలేక ఆ చిన్నారి ఏడుస్తూనే ఉండటంతో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన పూజిత- ప్రవీణ్ దంపతులు నిర్మల్‌లోని సదరు హాస్పిటల్‌కు తీసుకురావడంతో వైద్యులు పలు పరీక్షలు చేశారు. బాబుకు కిడ్నీ, మూత్రనాళం మధ్యలో పీయూజే (పెల్వి యూరెటర్ జంక్షన్) దగ్గర వాపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. చిన్న పిల్లల శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ లీలాకుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ నాలం శశికాంత్, కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ మల్లేశ్, తదితరులు ఆ చిన్నారికి శస్త్ర చికిత్స చేశారు. ఆపరేషన్ తర్వాత ఆ బాబు కోలుకోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐకేపీ ఏపీఎం బోసు, సీసీ జ్యోతిర్మయి, స్వశక్తి మహిళలు

ఎయిడ్స్ నివారణకు కృషి

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోజు రోజుకు విస్తరిస్తున్న హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో స్వశక్తి మహిళల భాగస్వామ్యం అవసరమని ఐకేపీ ఏపీఎం బోసు అన్నారు. గురువారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామైక్య సంఘం మహిళలకు హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సీసీ జ్యోతిర్మయి, వీవోఏ నర్సయ్య, గ్రామైక్య సంఘం నాయకురాళ్లు సంతోష, సల్మాబేగం, మమత, దివ్య, ఐసీటీసీ సంస్థ సలహాదారులు సుదర్శన్, శ్రీనివాస్, స్వశక్తి సంఘాల నాయకురాల్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీటి సహాయకుల పాత్ర కీలకం



సహాయకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీడీఓలు అశోక్‌కుమార్, శివకుమార్‌లు

ముథోల్, న్యూస్‌టుడే : రాబోయే రోజుల్లో గ్రామాల్లో మంచి నీటి సహాయకుల పాత్ర కీలకమని బాసర, ముథోల్ ఎంపీడీఓలు అశోక్ కుమార్, శివకుమార్‌లు అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీకి ఒకరిచొప్పున మంచి నీటి సహాయకులను ఎంపిక చేసి వారికి మండలంలోని తరోడ గ్రామంలోని రైతు వేదికలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆయా మండలాల ఎంపీడీఓలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మిషన్ భగీరథ ఏఈ అరుణ్, బాసర ఎంపీఓ గంగాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార దిగ్గజానికి ఘన నివాళి



మౌనం పాటిస్తున్న పాత్రికేయులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : ఎన్నో రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తూనే దాతృత్వంలో తనదైన ముద్ర వేసుకున్న రతన్‌టాటా మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. దేశభక్తిలోనూ ఆయన అందరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. పౌరులందరూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సమాజాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేయాలని పిలుపునిచ్చారు.

పెంబి : ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి పట్ల గురువారం పెంబి మండల కేంద్రంలో జనసేన, భాజపా పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా మండలాధ్యక్షుడు వెంకటేష్, జనసేన నాయకులు రాజు, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాల అందజేత

నిర్మల్ అర్బన్: నిర్మల్‌లోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కుమ్మర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (కేవా) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తోడిశెట్టి పరమేశ్వర్, పోతుగంటి సాయన్న తెలిపారు. పది, మాధ్యమిక వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఇటీవల పదోన్నతి పొందిన, ఉత్తమ ఉపాధ్యాయ, ఉద్యోగ అవార్డులు స్వీకరించిన, ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకమైన వారికి ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు.